క్లుప్తంగా

మధ్యాహ్న భోజన వంటగది ప్రారంభం



వంట గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మధ్యాహ్న భోజన వంటగదిని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమ సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా ఈ గదిని నిర్మించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.శోభారాణి, ఎంపీటీసీ ఎ.శ్రీనివాసరావు, నాయకులు లంకలపల్లి ప్రసాద్, మునగాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: రామజోగిపేటలో మంగళవారం అసిరితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు అమ్మవారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. వర్షాలు అనుకూలించి, పంటలు పండాలని ఘటాలు, ముర్రాటలు సమర్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురంలో రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు మంగళవారం ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి భూమిపూజ నిర్వహించారు. మండల పరిషత్ నిధులు, ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. అనంతరం ముద్దాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మోనటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక వంటి పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దున్న రామ్మోహన్, సర్పంచ్ ముద్దాడ శంకర్, నాయకులు బెండు రామారావు, బగ్గు రాజారావు, గొలివి అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



వెంకటాపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

లావేరు: వెంకటాపురంలోని రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బొంతు ఎల్లంనాయుడు, జగ్గురోతు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మేలు రకాలైన వరి విత్తనాలను రాయితీపై సరఫరా చేసినట్లు తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ధర్మారావు, ఉప సర్పంచ్ అన్నపూర్ణ, వార్డు మెంబర్లు పిన్నింటి సత్యం, వావిళ్ల రామారావు, మీసాల రమణ, లుకలాపు కృష్ణ, శనపతి తవుడు పాల్గొన్నారు.

తోటపల్లి పెండింగ్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: భూ సేకరణ సమస్య వల్ల పెండింగ్‌లో ఉన్న భూములకు సంబంధించి రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించి తోటపల్లి కాలువ తవ్వకాల పనులు చేపడుతున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. పైడిభీమవరంలో తోటపల్లి కాలువ పెండింగ్ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావేరు, రణస్థలం మండలాల్లోని శివారు భూములకు సాగునీరు అందించేందుకు శరవేగంగా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో తోటపల్లి డీఈ హరిప్రసాద్, జేఈ రామలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్లా వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, పిల్ల ఆనందరావు పాత్రుడు, గురాన మానస, ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, అల్లంపల్లి బాషా తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు

- టీడీపీది కాపీ మేనిఫెస్టో
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: పేదల పక్షపాత పార్టీ వైఎస్సార్ సీపీయేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పేదల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరిశాయని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడు సచివాలయం పరిధిలోని తంగివానిపేటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యం, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఎందరో ఆకలి దప్పికలను తీర్చినట్లు గుర్తు చేశారు. మధ్యవర్తులు, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తారీఖునే పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళలను, రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. ప్రజాధనాన్ని ముఖ్యమంత్రి జగన్ వృథా చేస్తున్నారని ప్రతిపక్షాలు బురద జల్లుతున్నాయని, అవే పథకాలను తిరిగి కాపీ కొట్టి ఎన్నికల ముందు మ్యానిఫెస్టోగా టీడీపీ విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చినట్లు స్పష్టం చేశారు. తంగివానిపేట లో 1200 మందికి ఇళ్లు కట్టించామని, 600 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, రూ.23 లక్షలు వెచ్చించి పాందరవీధిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు మార్చామని వివరించారు. అనంతరం రూ.7.8 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ధర్మాన ప్రారంభించారు. యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గత నాలుగేళ్లలో తంగివానిపేటలో రూ.13 కోట్ల 98 లక్షలతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు ఎం.వి.పద్మావతి, పైడిశెట్టి జయంతి, వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, సాధు వైకుంఠరావు, మూకళ్ల తాతబాబు, గొండు కృష్ణ, ఎన్ని ధనుంజయరావు, చల్లా శ్రీనివాస్, అల్లు లక్ష్మీనారాయణ, కోణార్క్ శ్రీను పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం



శ్రీకాకుళం న్యూకాలనీ: టాపర్లకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



జి.సిగడాం: జి.సిగడాం హైస్కూల్ విద్యార్థిని సత్కరిస్తున్న ఎంఈఓలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు ప్రభుత్వం సత్కరిస్తోంది. జగనన్న ఆణిముత్యాల పేరిట వివిధ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిల్లో టాపర్లగా నిలిచిన విద్యార్థులకు ఘనంగా సత్కరించిన విషయం తెలిసిందే. ఇప్పటికీ పాఠశాలల స్థాయిలో టాపర్లకు సత్కారాలు కొనసాగుతునే ఉన్నాయి. మంగళవారం శ్రీకాకుళం నగరంలోని బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో టాపర్లగా నిలిచిన తమ్మినేని మౌణిక, దంత హన్సిక, కొల్లి వర్షితలను సత్కరించారు. వరుసగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి రూపాయిల చొప్పున నగదు బహుమతులు, మెడల్స్, ప్రసంశా పత్రాలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులను హెచ్‌ఎం ఏవీ మురళీకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ పాదిలాపు స్వామినాయుడు, డాక్టర్ కనకరాజు అభినందించారు. అనంతరం ప్రభుత్వం విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతున్న తీరు, అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలపై హెచ్‌ఎం మురళీకృష్ణ అధ్యక్షతన పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.సుబ్రహ్మణ్యం, వీఎస్ఎస్ ప్రసాద్, కె.మాధవరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన చంద్రయ్యపేటకు చెందిన హేమసుంద రావుకు బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు నర్సింహంమూర్తి చేతుల మీదిగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుప్పిలి రవికుమార్ పట్నాయక్ , దుంపల సాయిరాం, అరసవిల్లి తారకేశ్వరావు, మీసాల ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

‘సీనియర్లను విస్మరించడం సరికాదు’

శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి ఏకపక్షంగా వ్యవహరిస్తూ పలువురు సీనియర్లను విస్మరిస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు పార్టీ పరిశీలకుడు చింతల రామకృష్ణ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం ఇన్‌చార్జి తీరుపై అసంతృప్తితో ఉన్న పలువురు నాయకులు ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి ఆమె వ్యవహార శైలిని తెలియజేస్తూ వస్తున్నారు. తాజాగా మినీ మహానాడులో యనమల రామకృష్ణుడు, అశోక్‌గజపతి రాజు వంటి నాయకుల ద్వారా ఇక్కడి పరిస్థితిని అధిష్ఠానం దృష్టికి తీసుకుని వెళ్లటంతో పరిశీలకుడిని పంపించారు. సోమవారం ఉదయం సమావేశం జరగాల్సి ఉండగా శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న గొండు శంకర్ వర్గానికి చెందిన సుమారు 500 మంది, తటస్థులు మరో 100 మంది వరకు సమావేశానికి రావటంతో దీనిని సాయంత్రానికి వాయిదా వేశారు. 10 నుంచి 20 మందికి రమ్మంటే ఇంత మంది ఎందుకు వచ్చారని జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ వచ్చిన వారిని ప్రశ్నించారు. తమ ఆవేదన, జరిగిన నష్టాన్ని చెప్పుకునేందుకు వచ్చామని వారంతా తెలిపారు. అయితే చాలామంది వెళ్లిపోతారని జిల్లా, నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు భావించి సమావేశం వాయిదా వేశారు. సాయంత్రం వరకు హాజరైన 600 మంది టిడిపి కార్యాలయ ఆవరణలోనే ఉండిపోయారు. ఇక చేసేది లేక సాయంత్రం 7గంటల సమయంలో సమావేశం ప్రారంభించి రాత్రి 10గంటల వరకు కొనసాగించారు. వీరంతా ఇన్‌చార్జి తీరును తప్పు పడుతూ పార్టీ కార్యక్రమాల సమాచారం తెలియటం లేదని, ఆహ్వానాలు అందటం లేదని తెలిపారు.

జేసీఐ గ్రీన్‌సిటీకి అవార్డుల పంట



అవార్డులు అందుకుంటున్న గ్రీన్‌సిటీ ప్రెసిడెంట్, సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జేసీఐ మిడ్ కాన్ సందర్భంగా ఇటీవల విశాఖలోని ఏయూ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. శ్రీకాకుళం గ్రీన్ సిటీకి నాలుగు అవార్డులు వచ్చాయని ప్రెసిడెంట్ మణిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్ ప్రోగ్రాం, పీఆర్ ఏరియా ప్రోగ్రామ్, జీఅండ్‌డీ ఎడ్యుకేషనల్ డ్రైవ్ అండ్ దాస్ విభాగాల్లో అవార్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. సెనేటర్ పి.మధుబాబు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. వ్యక్తిగత అవార్డుల్లో అవుట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ మణిశర్మకి, అవుట్ స్టాండింగ్ లేడీ మెంబర్స్ వరలక్ష్మి, చార్టర్ ప్రెసిడెంట్ సాయి వినూత, ఉమలకు, యాక్టివ్ మెంటర్స్‌గా జగదీష్, గణపతిలకు అవార్డులు లభించాయి.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

లావేరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయని ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, బెజ్జిపురం హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.రమణ అన్నారు. పెదలింగాలవలస ప్రభుత్వ పాఠశాల, బెజ్జిపురం హైస్కూల్‌లో మంగళవారం తల్లిదండ్రులు పర్యవేక్షణ కమిటీ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్లు బి.సూర్యారావు, డి.సుజాత, హెచ్‌ఎం గణపతి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఇప్పిలి కృష్ణ, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.

4 నుంచి వీధి వ్యాపారులకు శిక్షణ



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలో ఆహార తయారీ వీధి వ్యాపారులకు జూలై 4 నుంచి 8 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు మెప్మా పీడీ కిరణ్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూ యువజన కేంద్రంలో శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మెప్మా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ టిఫిన్ తయారీదారులు, బజ్జీషాపులు, చాట్ బండి, పానీపూరీలు, ఫ్రూట్‌జ్యూస్ తయారీదారులు శిక్షణకు హాజరుకావాలన్నారు. రూ.2వేలు విలువైన ఫుడ్ వెండింగ్ సర్టిఫికెట్, ఎప్రాన్, క్యాప్, శానిటైజర్లు ఇస్తామని తెలిపారు. ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేసిన సమయంలో సర్టిఫికెట్ తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్‌లో జగనన్న తోడు, పీఎం స్వానిధి రుణాలు, ఇతర పథకాలకు ఈ సర్టిఫికెట్ తప్పనిసరని పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకటరత్నం, ఫుడ్‌సేఫ్టీ అధికారి లక్ష్మి, కార్పొరేట్ అఫైర్స్ వసీమ్ అహ్మద్, నెస్లే ఇండియా మేనేజర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ నిశ్చల

జి.సిగడాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ నిశ్చల అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని పరిశీలించి పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఇంటింటా ఓటరు సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి

శ్రీకాకుళం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవల్ అధికారులు జూలై 20 నుంచి ఇంటింటా సర్వే తప్పనిసరిగా చేపట్టాలని శ్రీకాకుళం ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్.వెంకట్రావు అధ్యక్షతన బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బీఎల్‌ఓ ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఓటర్ల సర్వే జాగ్రత్తగా చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటర్లతో మాట్లాడాలన్నారు. ఓటుకు దగ్గరిగా ఉన్న పోలింగ్ బూత్ వద్దే ఓటు నమోదు చేయిస్తూ దానికి ఆధార్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. డెత్ వంటి వివరాలు ఉంటే కుటుంబ సభ్యులతో మాట్లాడి దరఖాస్తు తీసుకోవాలన్నారు. సర్వే ప్రక్రియ పూర్తయితే అక్టోబర్ 17న ప్రాథమిక ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్లు రాజు, హేమసుందర్ పాల్గొన్నారు.

ఘనంగా భద్రమ్మతల్లి వారాల ఉత్సవం



భద్రమ్మతల్లి ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలో భద్రమ్మ తల్లి అమ్మవారి వారాల పండుగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నిలువెత్తు విగ్రహంతో ఊరేగింపు నిర్వహించగా, మహిళలు ఘటాలతో పాల్గొన్నారు. అనంతరం ముర్రాట్లు సమర్పించారు.

ముగిసిన వారాహి అమ్మవారి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నది ఒడ్డున బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పూర్ణాహుతి నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, యంత్రపూజ, ద్వాదశి హారతులు ఇచ్చారు.

పేద విద్యార్థులకు వరం కేజీబీవీ

జి.సిగడాం: పేద విద్యార్థులకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వరం వంటివని ఎంఈఓ అరసాడ రవి అన్నారు. మంగళవారం కేజీబీవీలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. పట్టుదలతో చదివి ఉత్తమ ప్రతిభ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారత్న కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తేనే సమస్యల పరిష్కారం

- జగనన్న సురక్షను విజయవంతం చేయాలి
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పిలుపు



హాజరైన నాలుగు మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు శతశాతం పూర్తవుతాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం అమలుపై నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902 కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్హత ఉండి పింఛన్, జగనన్న ఇళ్లు, నవరత్నా పథకాలు అందడం లేదని ఫిర్యాదులు చేరాయని చెప్పారు. ఇంకా క్షేత్ర స్థాయిలో సమస్యలు ఉన్నాయని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు చెప్పినా అధికారులు దృష్టి సారించకపోతే సమస్యలు అలాగే ఉండిపోయాతాని చెప్పారు. జూలై 1 నుంచి జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు కలిసికట్టుగా పనిచేస్తే శతశాతం సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి, పప్పల వెంకటరమణ, ఎంపీడీవోలు ఆర్.వి.రమణమూర్తి, సురేష్, రమాదేవి, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడు బాబు, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, రణస్థలం, లావేరు, జి.సిగడాం జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, మురళీధరబాబు, మహంతి పెదరామినాయుడు, బూరాడ వెంకటరమణ, చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడపగడపకు సంక్షేమం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారునికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందడంతో అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. పైడిభీమవరం గ్రామ సచివాలయ పరిధిలోని సరగడపేట, చిట్టివలస, చిల్లపేట, వరిసాం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు – మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగి ఉండి పథకాలు రాకపోతే వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ జగనన్న ఇళ్ల కాలనీలు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, వసతి దీవెన అందిస్తున్నామని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం ఇన్ని సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. పథకాలన్నీ కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోని రావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్ సీపీ మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, పిల్ల ఆనందరావు పాత్రుడు, రెడ్డి విశ్వేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, పైడిభీమవరం గ్రామ ఎంపీటీసీలు ఆకల శ్రీనివాసరావు, మునకాల దుర్గారావు, గ్రామ నాయకులు అల్లంపల్లి బాషా, నారాయణప్పారావు, పిప్పళ్ల వెంకటేష్ వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్‌-18 బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు



బాస్కెట్‌బాల్ బాలికల జట్టుతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలు, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానం వేదికగా మంగళవారం ఫ్లడ్‌లైట్ల వెలుతురు మధ్య జిల్లా అండర్‌–18 బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. వీటితోపాటు వేసవి క్రీడా శిక్షణా శిబిరాల (సమ్మర్ కోచింగ్ క్యాంప్) ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వహణ కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి కృష్ణా జిల్లా నూజివీడు వేదికగా 8వ ఏపీ రాష్ట్రస్థాయి అండర్‌–18 బాలబాలికల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని తెలిపారు. అనంతరం రాష్ట్రపోటీలకు వెళ్లే జిల్లా జట్లకు రూ.5వేలు సాయాన్ని అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్స్ ఎండీ కాసింఖాన్, కళావతి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణశాఖ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఎం.వరప్రసాద్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు మాస్టారు, సెపక్ తక్ర అసోసియేషన్ జిల్లా కోశాధికారి బి.వి.ఎస్.ఎన్.రాజు, జాయింట్ సెక్రటరీ జి.వేణుగోపాలరెడ్డి, సీనియర్ క్రీడాకారులు లవకుమార్, బాబ్జీ, కొర్లయ్య, రవి, రాజు, సింహాచలం, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల పరిషత్ ప్రత్యేకాహ్వాతుడు మీసాల వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ అన్నారు. మంగళవారం జి.సిగడాం రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇలపు శ్రీనివాసరావు, సర్పంచ్ ముద్దాడ గౌరీ, మహదాస్యం నారాయణరావు, పిన్నింటి రామినాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పుట్టా సమీరా, కుమరాపు సుగుణాకరరావు, అలుగోలు లక్ష్మినారాయణ, ముంతా హేమంత్ కుమార్, హరికృష్ణ, అంపోలు అనూషా, ముంతా హరీష్, పొగిరి నారాయణరావు, బొడసింగి రాణి, ఆయేషా బేగం పాల్గొన్నారు.

ఘనంగా బ్యూటీషియన్ డే



కేక్ కట్ చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: ‘బ్యూటీషియన్’ పని విభిన్నమైన వృత్తి అని, దీనికి ఓర్పు సహనం ఎంతో అవసరమని స్టార్ బ్యూటీ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం థెరపీ అసోషియేషన్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. స్థానిక హోటల్‌లో మంగళవారం అంతర్జాతీయ బ్యూటీషియన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ కాస్మోటాలజిస్టు, స్టార్ బ్యూటీస్ ప్రతినిధి ప్రిస్కిల్లా గిరిరాజ్ మాట్లాడుతూ బ్యూటీషియన్ రంగాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బ్యూటీషియన్లు పాల్గొన్నారు.

రైలు కింద పడిన ప్రయాణికుడు

- రక్షించిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కదులుతున్న రైలు ఎక్కబోయి కాలుజారి ప్లాట్‌ఫాం, రైలు మధ్యలో ఇరుక్కుపోయిన ప్రయాణికుడిని రైల్వే పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యాపారి ఎస్.శ్రీనివాస్ వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడ వచ్చాడు. తిరిగి స్వస్థలానికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పుడే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంపై నుంచి బయలుదేరింది. దీంతో పరుగెత్తుకుంటూ వెళ్లి రైలు ఎక్కబోయే క్రమంలో అదుపు తప్పి రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో శ్రీనివాస్ ఇరుక్కుపోయాడు. అక్కడే వీధుల్లో ఉన్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వెంటనే స్పందించి అతడిని కిందికి జారిపోకుండా పట్టుకుని కాపాడే ప్రయత్నం చేశారు. తోటి ప్రయాణికులు రైల్వే గార్డ్, డ్రైవర్‌లకు సమాచారం అందించడంతో వారు రైలును నిలిపివేశారు. అనంతరం శ్రీనివాస్‌ను బయటకు తీశారు. అతను స్వల్పంగా గాయపడటంతో 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండి ప్రయాణికుడి ప్రాణాలను కాపాడిన జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ తేజ వరప్రసాద్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ రాంబాబు, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను ప్రయాణికులు అభినందించారు.